రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

- కుటుంబ, ఆరోగ్య సంక్షేమశాఖ కమిషనర్ కర్ణన్
- చేవెళ్ల ఏరియా దవాఖానతో పాటు మొయినాబాద్ పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

చేవెళ్లటౌన్ : ఏరియా ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కమిషనర్ కర్ణన్

చేవెళ్ల టౌన్, ఆగస్టు 30 : విషజ్వరాలతో ప్రభుత్వ దవాఖానలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అదేశాల మేరకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కేవీ కర్ణన్ శుక్రవారం చేవెళ్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసి, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. వార్డుల్లో తిరిగి రోగులను వైద్యం ఏలా అందుతుందని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సమస్యలను సూపరింటెండెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విషజ్వరాల నియంత్రణకు వైద్యులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా డెంగీ, మలేరియా కేసులు తక్కువగా ఉన్నాయని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రి ఫార్మసీని తనిఖీ చేసి మందుల నిల్వపై ఆరా తీశారు. రోగులు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రినే సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్స్, అంబులెన్స్ డ్రైవర్ల అవసరం ఉందని వైద్యులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆసుపత్రికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రియాసింగ్, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో హిమబిందు, ఎంపీవో విఠలేశ్వజీ, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ పీహెచ్‌సీ తనిఖీ

మొయినాబాద్ : సీజన్ వ్యాధులైన డెంగీ, మలేరియా జ్వరాలు విజృంభిస్తుండటంతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. దవాఖానల్లో వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు సరైన వైద్య సేవలందిస్తున్నారా..? గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారా..? అనే అంశాలపై సంబంధిత ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మొయినాబాద్ మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కర్ణన్‌తోపాటు అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆరోగ్య కేంద్రంలో ఒక నర్సు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ మాత్రమే ఉన్నారు. డాక్టర్‌తో సహా మిగిలిన సిబ్బంది లేకపోవడంపై వారిని అడిగారు. మండల పరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై గ్రామ కార్యదర్శుల సమావేశంలో పాల్గొనేందుకు పీహెచ్‌సీ డాక్టర్ అన్నపూర్ణ, సీహెచ్‌ఓ వెంకట్‌రెడ్డితో పాటు సూపర్‌వైజర్లు వెళ్లారని సిబ్బంది కమిషనర్‌కు వివరించారు. దాంతో అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ ఎంపీడీఓ సంధ్యకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నారు.

మొయినాబాద్ పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్

మందుల నిల్వపై ఆరా

అనంతరం కమిషనర్ పీహెచ్‌సీలో ఫార్మాసిస్టుతో మాట్లాడి దవాఖానలో మందులు ఉన్నాయా? రోగులకు మందులు ఇస్తున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. ఫార్మాగదిలోకి వెళ్లి మందులను పరిశీలించారు. దవాఖానకు వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. కాగా కమిషనర్ పీహెచ్‌సీకి వచ్చారని తెలుసుకున్న డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది ఆయన వెళ్లిపోయాక దవాఖానకు చేరుకోవడం గమనార్హం.

బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను వెంటనే తరలించండి

అధికారులకు సూచిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఆగస్టు 30 : ఎన్నికల బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను ఈవీఎంలను భద్రపరిచిన గిడ్డంగికి వెంటనే తరలించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం వికారాబాద్ మార్కెట్ యార్డులో భద్రపరిచిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన స్ట్రాంగ్‌రూమ్‌ల సీళ్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో తెరిచారు. ఈ సందర్భంగా వికారాబాద్, తాండూర్, పరిగి శాసనసభ నియోజకవర్గాల బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌లను పట్టణ కేంద్రంలోని ఈవీఎంలను భద్రపరిచిన జిల్లా గిడ్డంగికి జాగ్రత్తగా తరలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్డీవోలు వాసుచంద్ర, శ్రీనివాస్‌రావు, తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, తారాసింగ్, ఆనంద్‌కుమార్, ఎన్నికల సూపరింటెండెంట్ నయామత్ అలీ పాల్గొన్నారు.

యూఆర్ఎస్‌లో బోధనేతర సిబ్బందికి దరఖాస్తులు

సిటీబ్యూరో, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): సమగ్ర శిక్ష హైదరాబాద్ జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి చెందిన పట్టణ బాలుర గురుకుల పాఠశాలలో బోధనేతర సిబ్బంది కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది, డిగ్రీ అర్హతతో అకౌంటెంట్, వంట మనిషి, సహాయ వంట మనిషి, సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు ఉన్నాయని చెప్పారు. సెప్టెంబర్ 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్ డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక, పాల్గొన్న అధికారులు

రంగారెడ్డి, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ) : గణేశ్ నవరాత్రోత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని కలెక్టర్ శశాంక ప్రజలకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణేశ్ ఉత్సవాల ఏర్పాట్లపై డీసీపీలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభమై 17న నిమజ్జనం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వినాయక మండప నిర్వాహకులు ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి మండపాల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లాలో గణేశ్ నిమజ్జనానికి 44 చెరువులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. గణేశ్ శోభాయాత్ర కోసం రహదారుల ప్యాచ్‌వర్క్, మరమ్మతులు, నిమజ్జనం నిర్వహించే ప్రదేశాల వద్ద క్రేన్లు, బారికేడ్లు, వేదిక ఏర్పాట్లను మున్సిపల్, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. చెరువుల వద్ద క్రేన్లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ముఖ్యంగా విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని, సమస్యలు ఉన్న చోట పోలీస్ బందోబస్తు పెంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, మెడికల్, శానిటేషన్, కంట్రోలింగ్ రూమ్ తదితర ఏర్పాట్లకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మహేశ్వరం, రాజేంద్రనగర్ డీసీపీలు సునీతారెడ్డి, శ్రీనివాస్, డీఆర్ఓ సంగీత, ఆర్డీఓలు సూరజ్‌కుమార్,సాయిరాం, అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్, ఆర్ అండ్ బి అధికారులు, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

రుద్రారంలో భారీ చోరీ

- దైవదర్శనాలకు వెళ్లిన మాజీ వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి దంపతులు
- వచ్చేలోగా ఇంట్లోని 18.5 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు అపహరించిన దుండగులు
- క్లూస్ టీమ్‌తో ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీస్ అధికారులు

రుద్రారంలో గోపాల్‌రెడ్డి ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న తాండూరు రూరల్ సీఐ అశోక్

పెద్దేముల్, ఆగస్టు 30 : ఓ కుటుంబం దైవదర్శనానికి వెళ్లగా.. ఇదే అదనుగా దుండగులు ఆ ఇంట్లోకి చొరబడి సుమారు 18.5 తులాల బంగారం, 10 తులాల వెండిని అపహరించిన ఘటన శుక్రవారం వికారాబాద్ జిల్లా పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రుద్రారం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ పి.గోపాల్ రెడ్డి దంపతులు నివాసం ఉంటున్నారు. శ్రావణమాసం కావడంతో ఈనెల 28న ఉదయం వారు ఇంటికి తాళం వేసి దైవదర్శనాలకు వెళ్లి గురువారం అర్ధరాత్రి 12.30 నిమిషాల ప్రాంతంలో చేరుకున్నారు. ఈ క్రమంలో ఇంటి మెయిన్ డోర్ తాళం తీసి ఉండటాన్ని గమనించారు. అనంతరం డ్రైవర్ నర్సింహులును పరిశీలించమని చెప్పగా డ్యూప్లెక్స్ పైన డోర్ తెరిచి ఉన్నట్లు తెలుసుకున్నారు. కింద బెడ్‌రూమ్‌లో కప్‌బోర్డులు, బెడ్‌లు ఓపెన్ చేసి ఉండటాన్ని చూసి పైన బెడ్‌రూమ్‌కు వెళ్లగా బీరువా పూర్తిగా ధ్వంసం చేసి అందులో ఉన్న సుమారు 18.5 తులాల బంగారు ఆభరణాలు,10 తులాల పాత వెండి ఆభరణాలు మాయమైనట్లు గమనించారు. దీంతో ఇంట్లో దొంగలు పడినట్లు నిర్ధారించుకొన్న గోపాల్ రెడ్డి దంపతులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

శుక్రవారం ఉదయం సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.గిరి పరిశీలించారు. అనంతరం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి,రూరల్ సీఐ అశోక్ చేరుకుని బాధితులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకొన్నారు. పోలీసు జాగిలంతో పరిశీలించారు. క్లూస్ టీం రంగంలోకి దిగి పలు ఆనవాళ్లను, ఫింగర్ ప్రింట్లను సేకరించింది. తదుపరి గ్రామంలో అనుమానం ఉన్న ప్రాంతాలను సీఐ, ఎస్ఐ పరిశీలించారు. బాధితుడు పి.గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణను వేగవంతం చేశారు. కాగా చోరీ ఘటనతో రుద్రారం ఒక్కసారిగా ఉలిక్కిపడింది, గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు.

ఇలా వచ్చి.. అలా వెళ్లారు..

- బంట్వారంలో తూతూ మంత్రంగా పౌరహక్కుల దినోత్సవం

బంట్వారం పంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్న తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, గ్రామస్తులు

బంట్వారం, ఆగస్టు 30 : ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి నెల చివరి వారంలో పౌరహక్కుల దినోత్సవాన్ని అధికారులు నిర్వహించాల్సి ఉన్నది. సమాజంలో ప్రతి పౌరుడికి తమ హక్కులు తెలిసేలా, బాధ్యతలు గుర్తు చేసేలా ఈ కార్యక్రమాన్ని చేపడతారు. అయితే బంట్వారం మండలకేంద్రంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయారాం.. గయారాం.. అన్న చందంగా పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామస్తులకు తెలియజేయకుండా అప్పటికప్పుడు గ్రామపంచాయతీ కార్యాలయంలో నలుగురు గ్రామస్తులను కూర్చోబెట్టి ఫొటో దిగి అయిపోయిందని చేతులు దులుపుకున్నారు. అక్కడకి వచ్చిన వారికి సైతం పౌరహక్కులపై అవగాహన కల్పించలేకపోయారని పలువురు విమర్శిస్తున్నారు. కనిసం బ్యానర్ సైతం పెట్టకపోవడం కొసమెరుపు. ఇటువంటి చర్యలతో ప్రజలు తమ హక్కులను ఇప్పటికీ తెలుసుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌తోపాటు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రేటర్‌కు రెండు రోజుల వర్ష సూచన

సిటీబ్యూరో, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కాగా, శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 29.4 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 22.7 డిగ్రీలు, గాలిలో తేమ 72 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్ టౌన్, ఆగస్టు 30: డెంగీ పట్ల ప్రజలతోపాటు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీడీవో బన్సీలాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీజనల్ వ్యాధుల అవగాహన కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాల్సిన బాధ్యత గ్రామ ప్రత్యేక అధికారులపై ఉందన్నారు. జ్వరాలు అధికంగా నమోదవుతున్న గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించడంతో పాటు ప్రజలకు చికిత్స అందించాలన్నారు. జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. ఈ సీజన్‌లో ప్రధానంగా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోధకాలు, మెదడువాపు వంటి వ్యాధులు వ్యాపిస్తాయని, తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఎంపీడీవో బన్సీలాల్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు కల్తీ కాకుండా శుభ్రంగా ఉండేలా, వర్షపునీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని ప్రజలకు సూచించారు.

కార్యక్రమంలో డాక్టర్లు నాగేంద్రబాబు, హరికిషన్, స్రవంతి, అమృతజోసెఫ్, నిఖిత, రాఘవేందర్, స్రవంతి, సీహెచ్‌వో నాగేశ్, ఎంపీహెచ్‌వోలు శ్రావణ్‌కుమార్, ఉపేందర్ రెడ్డి, పీహెచ్‌ఎన్ లుదియా, హెల్త్ సూపర్‌వైజర్లు అమృత, సువర్ణ, పుష్ప, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుంది..

- రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు
- మాఫీ కాని రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు వెల్లడి

ఫరూఖ్‌నగర్ మండల రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 30: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వస్తుందని, అందోళన చెందవద్దని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు పేర్కొన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కందివనం, చటాన్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం రుణమాఫీపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వ్యవసాయ సహాయ సంచాలకులు రాజరత్నంతో కలిసి పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ఇప్పటికే మొత్తం 22,579 మంది రైతులకు సంబంధించి రూ. 170 కోట్ల రుణమాఫీ పూర్తయిందని, మిగిలిన అర్హులైన రైతులకు సైతం రుణమాఫీ అవుతుందన్నారు. సాంకేతిక కారణాలతో కొంతమందికి రుణమాఫీ జరగలేదన్నారు. వారందరికీ రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇందుకోసం వ్యవసాయ అదికారులు ఇప్పటికే గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల కుటుంబ వివరాలు, ఆధార్ కార్డు, ఫొటో, తదితర పూర్తి సమాచారం సేకరించి అన్‌లైన్‌లో వివరాలు పొందుపరుస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారులకు రైతులు సహకరించి సమగ్ర వివరాలను అందజేయాలని ఆయన సూచించారు.

కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్, విస్తరణ అధికారులు తేజ్, గోవర్ధన్, రాంబాబు, ప్రణీత, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రైతులు కుటుంబ నిర్ధారణకు సహరించాలి

కొత్తూరు : రైతు రుణమాఫీ అమలులో భాగంగా కుటుంబ నిర్ధారణకు రైతులు సహకరించాలని జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు సూచించారు. మండలంలోని మల్లాపూర్‌లో రైతు కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి శుక్రవారం పరిశీలించారు. అనంతరం రైతులతో మట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఈవో గ్రామాల్లో పర్యటించి రైతుల కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆన్‌లైన్‌లో రైతు కుటుంబ సభ్యుల ఫొటో, ఆధార్ కార్డు వివరాలు నమోదు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఏడీ రాజారత్నం, ఏవో గోపాల్, రైతులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో మిస్టర్ అండ్ మిసెస్ హైదరాబాద్ పోటీలు

ఖైరతాబాద్, ఆగస్టు 30: మాక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21 నుంచి నగరంలో మిస్టర్ అండ్ మిసెస్ హైదరాబాద్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేశ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, ఫౌండేషన్ కన్వీనర్ అమల, ఆర్గనైజర్ జి.స్వప్న, ఫిట్‌నెస్ ట్రైనర్ అను ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. దీనేశ్ మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే మహిళలు, యువతులందరూ భారతీయ సంప్రదాయ వస్త్రాలను ధరించి ర్యాంప్ వాక్‌లో పాల్గొంటారని తెలిపారు. మిస్, మిసెస్ హైదరాబాద్, జూనియర్ మిస్, మిస్టర్ అండ్ మిసెస్, గార్జియస్ మామ్ టు బీ (ఆరు నెలల నుంచి ఎనిమిది నెలల గర్భవతులు) విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నామని, తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి సుమారు 1500 మంది పాల్గొంటారని, ఎంపికైన వారికి ఫైనల్ పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 81212 50102లో సంప్రదించాలన్నారు.

గాంధీ దవాఖానలో బీసీ నేతల ఆమరణ దీక్ష

- సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వారిని కలిసిన ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 30: కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, అధికారంలోకి రాగానే బీసీలను కాంగ్రెస్ మోసగించాలని చూస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆరు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని, బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ నేత, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్ పటేల్‌లు ఆరు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. శుక్రవారం వారిని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్, జైస్వరాజ్ పార్టీ అధ్యక్షుడు కాసాని శ్రీనివాస్ రావు, బీఎస్పీ ప్రధాన కార్యదర్శి ఎర్ర కామేశ్, తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు నారాయణ గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, ఇన్‌చార్జి కె.వెంకట్ గౌడ్, బీసీ ఆజాది సంఘ్ అధ్యక్షుడు డి.మహేశ్ గౌడ్, కార్యదర్శి విజయ్ కుమార్, అంబేద్కర్ ఆజాదీ సంఘం అధ్యక్షుడు కొంగర నరహరిలు పరామర్శించి, తమ సంఘీభావం తెలిపారు. అనంతరం, వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిలు ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం కోటా ఇచ్చాకనే ఎన్నికలకు వెళ్ళాలని డిమాండ్ చేశారు. వెంటనే సమగ్ర బీసీ జనాభా గణన చేపట్టాలని అన్నారు.

రెడ్డిఘణపూర్ పాఠశాలను సందర్శించిన డీఈవో

విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీఈఓ రేణుకాదేవి

బషీరాబాద్, ఆగస్టు 30 : మండలంలోని రెడ్డిఘణపూర్ పాఠశాలను శుక్రవారం డీఈఓ రేణుకాదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజనం తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేస్తామని పేర్కొన్నారు. ప్రమోషన్, బదిలీల కారణంతో ఉపాధ్యాయుల కొరత ఏర్పడినట్లు చెప్పారు. కొంత మంది ఉపాధ్యాయులు సెలవు ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై ఆరా తీశారు. ఆమె వెంట మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

ప్రగతిశీల మహా సభలను జయప్రదం చేయండి

చిక్కడపల్లి, ఆగస్టు 30: ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర 7వ మహాసభలను విజయవతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.ఝాన్సీ పిలుపునిచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఝాన్సీ మాట్లాడారు. ఈ నెల 31, సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఈ మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభల్లో భాగంగా శనివారం వీఎస్‌టీ నుంచి ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ అనంతరం, బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు.

గణేశ్ నిమజ్జనానికి బేబీ పాండ్స్‌ను సిద్ధం చేయండి

అధికారులకు మేయర్ ఆదేశం

సిటీబ్యూరో/బాలానగర్: గణేశ్ నిమజ్జనానికి చెరువులు, బేబీ పాండ్స్‌ను అన్ని వసతులతో సిద్ధం చేయాలని బల్దియా మేయర్ గద్వాల విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం కూకట్‌పల్లి జోన్‌లోని పలు చెరువులు, బేబీ పాండ్స్ వద్ద ఏర్పాట్లు, అభివృద్ధి పనులను పరిశీలించారు. హస్మత్‌పేట్ లేక్, బేబీ పాండ్, ప్రగతినగర్ చెరువు, ఐడీఎల్ లేక్,లింగం చెరువు, కొత్త చెరువు, వెన్నెల గడ్డ చెరువులు, బేబీ పాండ్స్ వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను మేయర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కేపీహెచ్‌బీలో ఓపెన్ జిమ్, అమ్మ భగవాన్ టెంపుల్ వద్ద బాక్స్ కల్వర్ట్ నిర్మాణ పనులు, మంగాపురం కాలనీలో ఫుట్‌బాల్ గ్రౌండ్ అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వారం లోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను మేయర్ ఆదేశించారు. చెరువులు, బేబీ పాండ్స్ వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. బేబీ పాండ్స్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేయాలని, నిమజ్జనం చేసిన విగ్రహాలు సంప్రదాయ పద్ధతిలో తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, లైటింగ్, మొబైల్ టాయిలెట్స్, తాగునీరు, హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్, అవసరమైన క్రేన్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగా